
ప్రజాశక్తి
గురువారం 7 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



పాదయాత్రను అడ్డుకోవడం అన్యాయం

పార్వతీపురం : బడిదేవరకొండపై అక్రమ మైనింగ్ ఆపాలని బడిదేవరకొండమ్మ పరిరక్షణ కమిటీ చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడంపై సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మండలంలోని గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసే అక్రమ మైనింగ్ లీజు రద్దు చేయాలని రెండు నెలలుగా ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నాయని చెప్పారు. మైనింగ్ యజమానిపై ప్రేమాభిమానం చూపిస్తున్న ప్రభుత్వం, పోలీసులు... ఎన్నికల కోడ్ పేరుతో శాంతియుతంగా చేస్తున్న పాదయాత్రను అడ్డుకోవడం దారుణమని ఖండించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు రద్దయ్యాయని, పోలీసులు లెంపలేసుకుని పరిరక్షణ కమిటీకి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

విద్యారంగ సమస్యలపై కదంతొక్కిన విద్యార్థులు

వారేమీ తీవ్రవాదులు కాదు.. సంఘవిద్రోహ శక్తులో, రౌడీలో, గూండాలో అంతకన్నా కాదు.. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాకు చెందిన విద్యార్థులు. పోడుభూముల్లో పంటలు పండించి, కూలీనాలీ చేసే గిరిజన, దళిత, వెనుకబడిన తరగతులవారు. ఏటా ప్రభుత్వం సాయం చేస్తే తప్ప వారి చదువుల బండి ముందుకు సాగే పరిస్థితి లేదు. అలాంటి తరుణంలో సర్కారు నిర్లక్ష్యంతో చేయాల్సిన సాయాన్ని మరిచింది. మరోవైపు విద్యాసంస్థల యాజమాన్యాల ఒత్తిడి ఎక్కువైంది. దీంతో ఎస్ఎఫ్ఐ అండతో తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనుకున్నారు. ఆ బాధననుభవిస్తున్న విద్యార్థులంతా జిల్లా నలుమూలల నుంచి భారీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. చీమల'దండు'లా వస్తున్న వారిని చూసిన ఖాకీలు ఊగిపోయారు. కలెక్టరేట్‌కు వెళ్లకుండా రహదారిని దిగ్బంధించారు. విద్యార్థులను అడ్డగిస్తున్నామనే నెపంతో అణచివేత చర్యలకు దిగారు. పిడిగుద్దులు గుద్దారు. ఊపిరి సల్పకుండా చేశారు. దీంతో పలువురు విద్యార్థులు స్పృహ తప్పి పడిపోయారు. అంతటితో ఆగలేదు.. తిరిగి విద్యార్థులపైనే అక్రమంగా కేసులు బనాయించారు.

- అడ్డుకున్న పోలీసులు
- కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత
- తోపులాటలో అస్వస్థతకు గురైన విద్యార్థులు
- జాయింట్ కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



విద్యార్థులను లాక్కెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పార్వతీపురం

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు కదంతొక్కారు. బుధవారం పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఈ ర్యాలీ, ధర్నాకు అనుమతులు లేవని పోలీసులు కలెక్టరేట్ వద్ద విద్యార్థులను అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు రోడ్డుపైనే బైఠాయించారు. ఎస్ఎఫ్ఐ నాయకులతో పోలీసులు వాగ్వివాదానికి దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో కొంతమంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మరి కొంతమంది అస్వస్థతకు గురయ్యారు. ఐదుగురు మాత్రమే వినతి పత్రం ఇవ్వడానికి లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పగా, ఎస్ఎఫ్ఐ నాయకులు అందుకు ఒప్పుకోలేదు. అధికారులు బయటకు వచ్చి తీరాలని పట్టుపడ్డారు. ఈ పరిస్థితిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ రోడ్డుపై బైఠాయించిన విద్యార్థుల వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు వారాలలో స్థానిక సమస్యలన్నీ పరిష్కరిస్తామని జెసి హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు విద్యార్థులతో మాట్లాడి కార్యక్రమాన్ని విరమించారు.

పోలీసుల అత్యుత్సాహం

విద్యార్థులు ధర్నా విరమించిన అనంతరం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ధర్నా శాంతియుతంగా ముగించినా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు, సభ్యులు భాస్కర్, శివ, అన్నాజీతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి, అనంతరం వారిని విడుదల చేశారు.



జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, డి.పండు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల చాలా కర్కశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలనను అందిస్తామన్న టిడిపి కూటమి సర్కారు.. కల్తీ లడ్డు, మద్యం, ఇసుక మాఫియా చుట్టూ మాత్రమే రాజకీయం చేస్తోందని, విద్యార్థుల సమస్యలను పూర్తిగా పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. విద్యాశాఖ మంత్రి ఇకనైనా విద్యారంగంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యా దీవెన, వసతిదీవెన డబ్బులు బకాయి ఉండటం వల్ల ఫీజు చెల్లించకుంటే సర్టిఫికెట్లు ఇవ్వబోమని, పరీక్షలు రాయినివ్వబోమని ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తెలపడంతో విద్యార్థులు చాలా మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే ఆ బకాయిలు చెల్లించాలని, తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో మెడికల్ కళాశాల ఊసే లేదని, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, పార్వతీపురం, పాలకొండ కేంద్రాలలో పీజీ, డైట్, నర్సింగ్ సెంటర్లు నెలకొల్పాలని డిమాండ్‌చేశారు. డిగ్రీలో మేజర్, మైనర్ (హానర్స్) విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్లను, వర్కర్లను వెంటనే నియమించాలన్నారు. గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాలలు, కురుపాం, బలిజిపేటలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. వీరఘట్టంలోని డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌సి, బిసి పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు అదనపు భవనాలు నిర్మించాలన్నారు. మెస్ ఛార్జీలు రూ.3 వేలకు పెంచాలని, బకాయి మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. సంక్షేమ హాస్టళ్లలో భోజనం కోసం అక్షయపాత్ర విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.డేవిడ్, టి.అఖిల్, సిహెచ్. సింహాచలం, సురేష్ , సింహాద్రి, శివ, సంజీవ్, గౌతమ్, షణ్ముఖ్, జై, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

అక్రమ కేసులు ఎత్తేయాలి : సిపిఎం

న్యాయమైన సమస్యలపై నిరసన చేపట్టిన విద్యార్థుల అరెస్టులు, తప్పుడు కేసులను సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఒక ప్రకటనలో ఖండించారు. ఎన్నికలు వాయిదా పడ్డాయని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు.. తల్లికి వందనం, జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా నిరసనలు చేపడుతున్నారని గుర్తుచేశారు. హామీల అమలు కోసం జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు కదిలి నిరసనగా వస్తే ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయాన్ని గౌరవించాల్సింది పోయి వారిని అడ్డుకోవడం, నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం సరైనది కాదని హితవుపలికారు.

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరణ మృదంగం కొనసాగుతూనే ఉంది. జిల్లాలో ఎక్కడో ఒకచోట విద్యార్థులు అనారోగ్యానికి గురై పిట్టల్లా రాలుతున్నారు. ఏ పాఠశాలలో ఎప్పుడు, ఎవరికి ఏమవుతుందో తెలియక భయంతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆశ్రమ పాఠశాల్లో వరుసగా కొనసాగుతున్న విద్యార్థుల మరణాలతో అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు మరణించడంతో జిల్లా వ్యాప్తంగా వసతిగృహాల్లో పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

పాపం పసివాళ్లు

- రెండు రోజుల్లో ముగ్గురు విద్యార్థులు మృతి
- పిట్టల్లా రాలుతున్న చిన్నారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

గిరిజన విద్యార్థి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస



మృతిచెందిన జీవన్

మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ (12) ఆకస్మికంగా మృతి చెందాడు. బుధవారం తెల్లవారుజామున తనకు ఎక్కువగా తలనొప్పి ఉందని తోటి విద్యార్థులకు చెప్పాడు. వారు వెంటనే డిప్యూటీ వార్డెన్ ఆర్.గణపతిరావుకు సమాచారమిచ్చారు. దీంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జీవన్‌ను తీసుకెళ్లారు. వైద్యాధికారి సిహెచ్ శంకర్రావు విద్యార్థికి చికిత్స అందించేలోగా జీవన్ ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణం విడిచినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుపతిరావు.. గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి పంచాయతీ ఒంజెడి గ్రామానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. కుమారుడి హఠాణ్మరణాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

జ్వరంతో బాలుడు మృత్యువాత



మృతిచెందిన నితిన్

కురుపాం : కురుపాం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న నిమ్మక నితిన్(9) అనారోగ్యంతో మృతి చెందాడు. జ్వరంతో బాధపడుతున్న నితిన్‌ను కుటుంబ సభ్యులు గత నెల 22న కురుపాం సిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం పార్వతీపురం తరలించారు. అక్కడ చికిత్స చేయగా జ్వరం తగ్గడంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో సోమవారం హాస్టల్ సిబ్బంది కురుపాం మండలం గుజ్జలగండ గ్రామంలో ఉన్న నితిన్ ఇంటికి వెళ్లారు. విద్యార్థి మళ్లీ తీవ్రమైన జ్వరంతో బాధపడటంతో వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి వార్డెన్ సూర్యనారాయణ దుడ్డుఖల్లు పిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు.

విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

కురుపాం : గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు మరణించారని, ఈ మరణాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందో చెప్పాలని కోరారు. గతంలో ఆదివాసీ గిరిజన సంఘం బృందం హాస్టళ్ల పరిశీలనలో వాటర్ ప్లాంట్లు పూర్తిగా నిర్వీర్యమైన విషయం వెలుగు చూసిందని తెలిపారు. వెంటనే వాటిని బాగు చేసి మినరల్ వాటర్ విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని కోరారు. మరణించిన రావాడ రామభద్రపురం పాఠశాల విద్యార్థి జీవన్ కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

పార్వతీపురం : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ మృతి చెందుతున్న విద్యార్థుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పది లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒక గిరిజన విద్యార్థి, బుధవారం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి నిద్రలోనే చనిపోయారని చెప్పారు. జిల్లాలో ఇంతవరకు ఏడుగురు విద్యార్థులు మరణించారని, ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి బాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు.

డామిట్..! కథ అడ్డం తిరిగింది

- కోర్టులో వైసిపికి చుక్కెదురు
- ఎమ్మెల్సీ రఘురాజుకు ఊరట
- పదవిలో కొనసాగించాలని హైకోర్టు ఆదేశం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కథ అడ్డం తిరిగింది. నోటిఫికేషన్ విడుదల, అభ్యర్థి ఖరారు తరువాత కోర్టులో ప్రతికూలంగా ఫలితం రావడంతో వైసిపికి ఎదురు దెబ్బ తగిలినట్లయ్యింది. దీంతో, వైసిపి అధిష్టానం మెదలుకుని జిల్లాలోని నాయకులు వరకు కంగుతిన్నారు. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ రద్దు కావడం ఖాయమేనా? లేదా వైసిపి సుప్రీంకోర్టుకు వెళ్తుందా అనే చర్చ సర్వత్రా జరుగుతోంది. గత ప్రభుత్వంలో వైసిపి తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు ఎన్నికైన విషయం విధితమే. కాలపరిమితి ప్రకారం ఆయన 2027 నవంబర్ 31వరకు కొనసాగాల్సివుంది. కానీ, గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించారన్న అభియోగంతో అదే పార్టీకి చెందిన పాలవలస విక్రాంత్ శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో, శాసన మండలి చైర్మన్ అనర్హత వేటు విధించి ఈ ఏడాది జూన్ 2న డిస్మిస్ చేసిన సంగతి విధితమే. దీనిపై రఘురాజు అప్పట్లోనే కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆరువారాలపాటు స్టే విధించింది. ఈ విషయమై బుధవారం (ఈనెల 6న) కోర్టు తీర్పురావాల్సి ఉన్నప్పటికీ, 3వ తేదీనే ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్ విడుదల చేసింది. వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైంది. మరోవైపు నోటిఫికేషన్ జారీ కాగానే రఘురాజు మరోసారి కోర్టుకు అప్పీల్‌చేశారు. దీంతో, స్పందించిన న్యాయస్థానం ఎమ్మెల్సీగా రఘురాజును కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు నోటిఫికేషన్ నేపథ్యంలో అభ్యర్థి ఎంపిక కోసం వైసిపి ఎంతో కసరత్తు చేసింది. చివరికి బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినఅప్పల నాయుడికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విషయమై శంబంగి హుటాహుటీన విజయవాడ కూడా చేరుకున్నారు. మరోవైపు టిడిపికి సవాలుగా మారినప్పటికీ అభ్యర్థి కోసం వెతుకులాట ప్రారంభించింది. ఇటువంటి పరిస్థితుల్లో రఘురాజుకు అనుకూలంగా కోర్టు స్పందించడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. గెలుపు సవాలుగా మారిన నేపథ్యంలో టిడిపి తరపున సుప్రీం కోర్టుకు వెళ్లేందుకు సాహశిస్తారా? స్థానిక సంస్థలన్నీ వైసిపి చేతిలోనే ఉన్న నేపథ్యంలో మిన్నకుండిపోతారా? అన్నది వేచి చూడాల్సిందే.

స్థానిక ఓటర్ల ఆశలు గల్లంతు

ప్రజాశక్తి-పార్వతీపురం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతుందని, తమ ఓటుకు మంచి రేటు పలుకుతుందని గంపెడాశలు పెట్టుకున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు తీవ్ర నిరాశ మిగిలింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో వైసిపికి 500పైగా స్థానిక సంస్థల ఓటర్లున్నారు. ఎన్నికంటూ జరిగితే ప్రధాన రాజకీయ పార్టీలు క్యాంపు రాజకీయాలు నడుపుతాయని, తమ ఓటుకు ఎంతో కొంత డబ్బులు ముడతాయని వారు భావించారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికకు కారకులైన ఇందుకూరి రఘురాజు తన అనర్హత వేటుపై హైకోర్టులో పిటిషన్ వేయడం, ఆయనకు అనుకూలంగా కోర్టు తీర్పు చెప్పడంతో ఎన్నిక రద్దయింది. 2027 వరకు రఘురాజే ఎమ్మెల్సీగా కొనసాగుతారని కోర్టు తీర్పునివ్వడంతో ఇసి నోటిఫికేషన్ రద్దయింది. అయితే హైకోర్టు తీర్పుపై ఇసి.. సుప్రీంకోర్టుకు వెళ్తుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఎన్నికల ముందు టిడిపి సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు పాల్గొనడంపై అప్పటి వైసిపి ఎమ్మెల్సీ విక్రాంత్... శాసనమండలి చైర్మన్‌కి ఫిర్యాదు చేయడంతో అనర్హత వేటు పడింది.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం ఇంజినీరింగ్ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 2018కి ముందు పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు చెల్లించారని గుర్తుచేశారు. గత వైసిపి ప్రభుత్వం 2022లో కేవలం రూ.3 వేలు నుండి 4,500 మాత్రమే పెంచి రూ.15 వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రధానంగా సామాజిక భద్రత పింఛన్లు రద్దు చేశారని చెప్పారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు 400 రెట్లు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పంప్ ఆపరేటర్లు, బోర్ మెకానిక్‌లు, డ్రైవర్లు, ఫిట్టర్లు, మెకానిక్ వెల్డర్లు, పెయింటర్లు, తదితర కేటగిరి కార్మికులకు జిఒ 7 ప్రకారం రూ.21,500, హెల్పర్లకు రూ.18,500 జీతం చెల్లించాల్సి ఉందన్నారు. ఇవేవీ అమలు కావడం లేదని మండిపడ్డారు. వెంటనే కూటమి ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల పదో తేదీన విజయవాడలో ఎంబి భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు హాజరై రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ.తాతబాబు, ఎం.రమేష్, ఎస్.మధుసూదనరావు, పి.రమేష్, బి.ఉమా, పి.వాసుదేవరావు, ఎం.కృష్ణ, ఎం.రమేష్, ఎ.శంకరరావు, కె.నాగరాజు, బి.రమేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు గిరిజన విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



అభిచంద్

మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆరిక అభిచంద్ (9వ తరగతి) అండర్-14 విభాగంలో ఫెన్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 12 నుంచి 16 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటాడని పీడీ మాధవరావు తెలిపారు. అభిచంద్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

104 సిబ్బంది డిమాండ్లపై వినతి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

104 సిబ్బంది డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బుధవారం వారు డిఎంహెచ్ఓ కె.విజయపార్వతి, 104 జిల్లా నోడల్ అధికారి వినోద్‌కుమార్‌కు వినతులు అందించారు. ఈ సందర్భంగా 104 సిబ్బంది మాట్లాడుతూ 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించడం చాలా కష్టమవుతుందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలని కోరారు. డిఎస్‌సి ద్వారా నియమితులై సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒలకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిబ్బంది దుర్గాప్రసాద్, ఆనందరావు, ప్రసాదరావు, జగదీశ్, సంతోష, తేజ పాల్గొన్నారు.

శిక్షణలు రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పార్వతీపురం

పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రకరకాల శిక్షణలను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు, జిల్లా అధ్యక్షులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అపార్ గుర్తింపు కార్డులకు సంబంధించి ఆధార్ కార్డుల్లో సవరణలు, పదోతరగతి నామినల్ రోల్స్, మెగా పేరెంట్స్ మీటింగ్‌లు, ఎఫ్ఎ-2 పరీక్షలతో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో రీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణలు ఆరు రోజుల పాటు విడతల వారీగా నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు, హెచ్ఎంలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆగిరిపల్లిలో శిక్షణ పొందుతున్న హెచ్ఎం శిక్షణ తరగతుల్లోనే మరణించారని తెలిపారు. తనకు ఒంట్లో బాగాలేదని, శిక్షణ తరగతులకు రాలేనని ఆ హెచ్ఎం చెప్పినా అధికారులు ఒత్తిడి చేశారని చెప్పారు. వెంటనే శిక్షణ తరగతులు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్‌పై విచారణ

జెసిని ఆదేశించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్ పనితీరుపై ప్రభుత్వం విచారణకు, అదే సమయంలో పనిచేసిన నలుగురు తహశీల్దార్లపై చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవ్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జెసి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తికి సూచించింది. వారం రోజుల్లో నివేదిక కూడా సమర్పించాలని పేర్కొంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి జెసి, డిఆర్‌ఒలకు వేర్వేరుగా ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. ప్రభుత్వం చర్యలకు భావిస్తున్న వారిలో భోగాపురం తహశీల్దార్‌గా పనిచేసిన రమణమ్మ, కొత్తవలస తహశీల్దార్ సురేష్, పూసపాటిరేగ తహశీల్దార్ సురేష్, జామి తహశీల్దార్ నీలకంఠరావు ఉన్నారు. వీరంతా అప్పట్లో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తప్పడు నివేదిక ఇచ్చి ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో విఫలం చెందారనేది ప్రభుత్వ అభియోగం. ఆర్‌డిఒ భూ సేకరణ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.



టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్‌ను కలిసిన జనసేన నాయకులు తిరుపతిరావు

టిడ్కో చైర్మన్‌ను కలిసిన 'పెంట'

ప్రజాశక్తి-మక్కువ

విజయవాడలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ని బుధవారం జనసేన మండల నాయకులు పెంట తిరుపతిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. జనసేన పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాడ మోహనరావుతో కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు.

ఉచిత శిక్షణకు 10న ఆన్‌లైన్ పరీక్ష

ప్రజాశక్తి-పార్వతీపురం

డిఎస్‌సి ఉచిత శిక్షణకు ఈ నెల 10న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ డిడి గయాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో ఆన్‌లైన్ పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకి సంబంధించిన హాల్ టికెట్లను https://janmabhoomi.ap.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చునని చెప్పారు.



బదిలీపై వెళ్లిన కమిషనర్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ గౌరీశ్వరి, తదితరులు

కమిషనర్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

బదిలీపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, ఉద్యోగులకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోని గౌరీశ్వరి, సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇటీవల బదిలీపై వెళ్లిన కమిషనర్ కె.శ్రీనివాస్‌తో పాటు డిఇ కిరణ్ కుమార్, ఎఇ ఆనంద్, సీనియర్ అసిస్టెంట్లు కిశోర్ కుమార్, చక్రవర్తి, ఆర్‌ఐ పి.నారాయణరావు, ఇతర సిబ్బందికి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. వారికి జ్ఞాపికలు ఇచ్చి, శాలువాలతో సత్కరించారు.ఉద్యోగ నిర్వహణలో పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ ఉద్యోగులు.. అందరి మన్ననలు పొందారని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేష్ కితాబిచ్చారు.

ప్లాస్టిక్ వద్దు : కమిషనర్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు కోరారు. స్వచ్ఛత సుందరం అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని నాలుగో వార్డు తూర్పువీధిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వాతావరణంలో మార్పులు, అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఒ పకీరురాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఎఎస్‌ఒ వీరినాయుడు, శానిటేషన్ సెక్రెటరీలు, మేస్త్రిలు పాల్గొన్నారు.

17న వీరఘట్టం మండల సమావేశం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని కోరారు

రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి

తల్లికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సవరవల్లి సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. విశాఖ జిల్లా పద్మనాభ మండలం పాండ్రంకి గ్రామానికి చెందిన కర్రి సూరిబాబు(40) మృతి చెందగా ఆయన తల్లి సంతోషికి తీవ్ర గాయాలయ్యాయి. సవరవల్లి వైపు నుంచి తగరపువలస వైపు బైక్ పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందర పేట ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టేకు చెట్లు మాయంపై దర్యాప్తు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని చామలాపల్లి రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్లు 66, 67 సబ్ డివిజన్‌లో ఉన్న ఎస్‌సి కార్పొరేషన్ భూముల్లో లక్షలు విలువ చేసే టేకు చెట్లు మాయంపై తహశీల్దార్ రాములమ్మ, అటవీ శాఖ అధికారులు బుధవారం దర్యాప్తు చేపట్టారు. జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం భూమి అభివృద్ధి పథకం ద్వారా ఇచ్చిన భూముల్లో 50 భారీ టేకు చెట్లను ఏ విధమైన అనుమతులూ లేకుండా రాత్రి బాగాన నాలుగు లారీలతో తరలించినట్లు వచ్చిన సమాచారం మేరకు తహశీల్దార్ రాములమ్మ, అటవీశాఖ అధికారులు, ఉప తహశీల్దార్ డి సన్యాసినాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి, మండల సర్వేయరు, సచివాలయ విఆర్‌ఒ క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేశారు. ఇప్పటికే వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో టేకు చెట్లు అక్రమ తరలింపుపై విఆర్‌ఒ ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఈ భూములు వివాదం కొత్తవలస కోర్టులో పెండింగ్ ఉందని, కోర్టులో వివాదం నడుస్తున్న భూముల్లో ఏ విధమైన అనుమతులూ లేకుండా టేకు చెట్లు మాయంపై దర్యాప్తు నివేదిక అందిన వెంటనే పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టుకు కూడా తెలియ జేశామని తహశీల్దార్ రాము లమ్మ తెలిపారు.

కూటమి హామీలను అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతానగరం

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్‌చేశారు. మండలంలోని చినబోగిలి వద్దనున్న వివేకవర్ధని కళాశాలలో సిపిఎం మండల మహాసభను బుధవారం నిర్వహించారు. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు అప్పారావు ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కమిటీ సభ్యులు గవర వెంకటరమణ అధ్యక్షతన జరిగిన మహాసభలో రెడ్డి వేణు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, ధరల పెంపుదలపై ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. లచ్చయ్యపేట చక్కెర పరిశ్రమను తెరిపించి, ప్రభుత్వమే నిర్వహించాలి, వెంగళరాయ సాగర్ ప్రాజెక్టుకు అదనపు ఆయకట్టు నిర్మాణం పూర్తి చేసి, గాదెలవలస, జానుముల్లువలస, కోట సీతారాంపురం, సుభద్ర సీతారాంపురం గ్రామాలకు నీరందించాలి, జంగావతి ప్రాజెక్టు పూర్తి చేసి మండలంలో 19 గ్రామాలకు సాగునీరు అందించాలి, సీతానగరం సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి, మహిళలపై దాడులను అరికట్టాలి, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి, తదితర అంశాలపై తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం మండల కార్యదర్శిగా రెడ్డి ఈశ్వరరావు, కమిటీ సభ్యులుగా రెడ్డి లక్ష్మునాయుడు, జి.వెంకటరమణ, డి.నారాయణరావు, రెడ్డి రమణమూర్తి, సిహెచ్ కృష్ణమూర్తి, మిరియాల నాగరాజు, వెన్నెల రామలక్ష్మి, గంట జ్యోతి, ఆర్.రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మన్మధరావు, బి.అప్పారావు, బి.రామస్వామి, వై.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం మండల మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

9.380 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో 9.380 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా ముత్తె గ్రామానికి చెందిన సుమిత పడల్ అనే మహిళ బుధవారం పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో రెండు బ్యాగులతో సంచరిస్తోంది. ఎస్‌ఐ వెంకట సురేష్, సిబ్బంది అటువైపు ఉన్న చాపరాయివలస గ్రామ సందర్శన నిమిత్తం వెళ్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆమె కనిపించింది. మహిళ వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 9.380 కిలోల గంజాయి లభ్యమైంది. కేసు నమోదు చేసి, ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-సీతంపేట

ఆదివాసీలకు స్పెషల్ డిఎస్‌సి తేవాలని సీతంపేట గిరిజన సంఘం కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హాజరు కావాలని కోరారు.

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంబంగి

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం



ప్రజాశక్తి-బొబ్బిలి

విజయనగరం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును అధిష్ఠానం ప్రకటించింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సభ్యులు ఇందుకూరి రఘురాజుపై వైసిపి అనర్హత వేటు వేసింది. దీంతో ఉప ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 4న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో వైసిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును ఆ పార్టీ ప్రకటించింది. టిడిపి కూటమి మాత్రం ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపికి చెందిన వారే అత్యధికంగా విజయం సాధించారు. మున్సిపల్, ఎంపిటిసి, జెడ్‌పిటిసిలుగా వైసిపి వారే ఎక్కువమంది ఉండడంతో ఆ పార్టీ విజయం తథ్యమని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక సంస్థల్లో టిడిపికి బలం లేకపోవడంతో తమ అభ్యర్థిని పోటీ పెట్టేందుకు అధిష్టానం వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఉన్న 743మంది ఓటర్లు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఉన్న విజయనగరం, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, కురుపాం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో 743మంది ఓటర్లు ఉండగా వారిలో 9మంది మరణించారు. మొత్తం ఓటర్లలో టిడిపి కూటమికి 155మంది ఓటర్లు ఉండగా, వైసిపికి 578మంది ఓటర్లు, ఒక ఇండిపెండెంట్ ఓటరు ఉన్నారు. ఈఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్లు కొంతమంది వైసిపిని వీడి టిడిపి, జనసేనలో చేరినప్పటికి వైసిపికే మెజారిటీ ఉండడంతో ఆ పార్టీ విజయం నల్లేరు మీద నడకే అని వైసీపీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

నాలుగు సార్లు విజయం సాధించిన శంబంగి

శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1981లో టిడిపిలో చేరిన శంబంగి 1983, 1985, 1994, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. టిడిపి అభ్యర్థిగా ఆరు సార్లు పోటీ చేసిన శంబంగి మూడు సార్లు విజయం సాధించగా 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి అపజయం పాలయ్యారు. 2019లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో ఓటమి చెందారు. టిడిపి హయాంలో ప్రభుత్వ విప్‌గా పనిచేసిన ఆయన వైసిపి హయాంలో ప్రొటెం స్పీకర్‌గా పనిచేశారు.

వైసిపి శ్రేణుల్లో ఉత్సాహం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థిగా శంబంగిని ప్రకటించడంతో నియోజకవర్గ వైసిపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో శంబంగి విజయం ఖాయమని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఫోకల్ స్ప్రే

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మలేరియా పాజిటివ్ వచ్చిన ప్రతి గ్రామంలోనూ ఫోకల్ స్ప్రే చేపట్టాలని, అప్పుడు కేసుల్ని అదుపులో ఉంచగలమని జిల్లా మలేరియా అధికారి మణి అన్నారు. బుధవారం దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను తనిఖీ చేశారు. వైద్యాధికారి ప్రవీణ్‌తో మలేరియా, డెంగీ వ్యాప్తిపై గురించి చర్చించారు. అనంతరం కుంతేసు గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఆ గ్రామంలో ఇటీవల వచ్చిన పాజిటివ్ కేసుల్ని సందర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తోయక నవీన్ అనే బాలుడిని పరీక్షించి చూశారు. ఆ ఇంట్లో ఉన్న సభ్యులందరికీ రక్త పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, విస్తరణాధికారి సత్యరాజు, సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ, ఆదినారాయణ, ఎఎన్‌ఎం కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న డిఎంఒ మణి

విద్యార్థికి రక్తదానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అత్యవసర సమయంలో విద్యార్థికి మాజీ ఆర్మీ ఉద్యోగి రక్తదానం చేశారు. మండలంలోని జెకెపాడు కాలనీకి చెందిన కద్రక రూపావతి నాలుగో తరగతి చదువుతోంది. రూపావతి రక్తహీనత కారణంగా అనారోగ్యానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఆర్మీ ఉద్యోగి చిన్ని.. ఆపదలో ఉన్న విద్యార్థిని ఆదుకునేందుకు బుధవారం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. దీంతో చిన్నిని జెకెపాడు గ్రామస్తులు అభినందించారు.



రక్తదానం చేస్తున్న మాజీ ఆర్మీ ఉద్యోగి చిన్ని

కంటి వెలుగు పరీక్షలు

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని పరశురాంపురం సచివాలయ పరిధిలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షణలో నేత్ర వైద్య సహాయకులు రమేష్ కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ సుకుమార్ బాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు విజయకుమారి, రామకృష్ణ, ఎంఎల్‌హెచ్ పి.లత, మహిళ పోలీసు మాధవి, ఆరోగ్య కార్యకర్త ప్రమీల పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని 14న ధర్నా

ప్రజాశక్తి-కొమరాడ

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ ఈనెల 14న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర తెలిపారు. బుధవారం కొమరాడలో సిపిఎం మండల సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడే అన్నారని, అధికారంలోకి వచ్చాక ఏం చేస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ నెల ఏడో తేదీ నుండి ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 14న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రామారావు, సింహాచలం, మధు, వెంకటేష్, కామయ్య, మాణిక్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు ఇందిర

ఆన్‌లైన్ సేవలు సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

సచివాలయంలో ఆన్‌లైన్ సేవలు లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని గుజ్జువాయి సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫైబర్‌నెట్ సచివాలయాల్లో ఉన్నా కేవలం దిష్టిబొమ్మలా మిగిలిందన్నారు. దీంతో పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందడం లేదని చెప్పారు. మండలంలో అనేక గిరిజన ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. వెంటనే ఆన్‌లైన్ సేవలపై దృష్టిపెట్టాలని కోరారు.



గుజ్జువాయి సచివాలయంలో దిష్టిబొమ్మలా ఉన్న ఫైబర్ నెట్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో గొయిది, మండ కాలనీ గ్రామాల్లో బుధవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు ఎస్‌ఆర్‌పి ప్రకాశ్, ఆర్‌టిఒ హేమసుందర్ అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై వచ్చిన ఆదాయం, దిగుబడి గురించి వివరించారు. రాబోయే రబీ సేజన్‌లో చేపట్టే కార్యక్రమాలను తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఎ ముసలయ్య, డివిజన్ ఇన్‌ఛార్జి బాలు, నరేష్, సత్యనారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ప్రకాశ్, హేమ సుందర్

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-సీతానగరం

మండల పరిధిలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యాన బుధవారం పూడ్చివేశారు. దీంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న పోలీసులు

అపరాల సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కురుపాం

అపరాల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త సన్యాసి ధ్రువ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం బయోటెక్ కిసాన్ హబ్ ప్రాజెక్టు కింద బుధవారం కొమరాడ, పార్వతీపురం, బాడంగి, రామభద్రపురం మండలాల రైతులకు 225 కిలోల మినుములు, 225 కేజీల పెసల విత్తనాలు పంపిణీ చేశారు. అపరాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు సాగు చేస్తే రైతులు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అపరాలకు మంచి డిమాండ్ ఉందని సూచించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు ఎస్.శ్రీనివాసరాజు, అనంతవిహారి, జట్టు సంస్థ సభ్యులు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో కొండపల్లి జంక్షన్ వద్ద సీతంపేట ఎస్‌ఐ వై.అమ్మన్నరావు రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. మితిమీరిన వేగం ప్రమాదమని, పరిమితి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించవద్దని ఆయన సూచించారు. మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ నేరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ సంజీవ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట.. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అమ్మన్నరావు

హెల్మెట్ తప్పనిసరి

సీతానగరం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని చినబోగిలి హనుమాన్ జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. గతంలో పెండింగ్ కేసులను క్లియర్ చేయించుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారే వాహనాన్ని నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని కురుకుట్టి నుండి డెన్సరాయి గ్రామం వరకు రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఎం డెన్సరాయి శాఖా మహాసభలో తీర్మానించారు. బుధవారం మండలంలోని డెన్సరాయి గ్రామంలో శాఖా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నేటికీ డోలిమోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గడివలస, డెన్సరాయి, గదబవలస మీదుగా కురుకుట్టి వరకు రోడ్డు నిర్మించాలని ఏళ్లతరబడి అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా కనీసం ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వర్షాకాలం వస్తే పూర్తిగా కిందకు రావడానికి వీల్లేకుండా పోయిందన్నారు. దీంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని వాపోయారు. వెంటనే రహదారి నిర్మించాలని డిమాండ్‌చేశారు. గత ప్రభుత్వంలో డెన్సరాయి పంచాయతీకి మంజూరైన రూ.20 లక్షల నిదులు సంపంగిపాడు పంచాయతీకి మళ్లించారని తెలిపారు. డెన్సరాయి పంచాయతీ గిరిజనులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. మళ్లించిన నిధులు వెంటనే తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకులు తీసుకోవడానికి సుమారు 10 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని, సంపంగిపాడు, డెన్సరాయి పంచాయతీ గ్రామాలకు జిసిసి డిపో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మర్రి శ్రీనివాసరావు, నాయకులు మర్రి లుబ్బు, కొర్ర సుబ్బారావు, మర్రి లెహరి, తదితరులు పాల్గొన్నారు.



జెండావిష్కరణలో పాల్గొన్న సిపిఎం నాయకులు, సభ్యులు, గిరిజనులు